

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రాజకీయ జన్మనిచ్చిన అంబర్‌పేట ప్రజలను మర్చిపోను

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గోల్నాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తనకు రాజకీయ జన్మనిచ్చిన అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలను ఎప్పటికీ మర్చిపోనని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్‌లో శంకర్‌నగర్, ఖాద్రీబాగ్ బస్తీల్లో పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. శంకర్‌నగర్‌లో రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం బస్తీలో ఏర్పాటు చేసిన సభలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మరోసారి బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు, డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి కర్రీ రవీందర్, బీజేవైఎం సెంట్రల్ జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీధర్‌గౌడ్, శంకర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సందీప్

ముషీరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్ (కార్డియో పల్మనరి రిసెక్షన్)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ శైలజ అన్నారు. బుధవారం రాంనగర్‌లో సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. గుండె ఆగిన వ్యక్తికి పదినిమిషాల్లో సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ సందీప్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని వాడవాడలా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కో-ఆర్డినేటర్‌లు క్రాంతి కిషోర్, ఇందిరా భారతి, శివరాణి, నీలకంఠ, రజని పాల్గొన్నారు.

'కళాకారులకు చేయూతనివ్వాలి'

చిక్కడపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కళాకారులకు చేయూతనివ్వాలని ఉస్మానియా యూనివర్సిటీ ఎన్జీవోస్ అధ్యక్షుడు బి. జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. జీఎస్ ఆర్ట్స్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో పలువురు ప్రముఖులకు ఆత్మీయ సత్కారాల కార్యక్రమం బుధవారం జరిగింది. జ్ఞానేశ్వర్‌తో పాటు గౌరవ డాక్టరేట్ వచ్చిన పద్యగాన కళాకారుడు డా. అభిమన్యుకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. వంశీ సంస్థల అధినేత డా. వంశీ రామరాజు, ప్రముఖ గాయకుడు డా. త్రినాథరావు, బీజేపీ నేత వెంకటరమణ పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు, గాయకుడు జి. శ్రీనివాస్ పర్యవేక్షణలో సినీ సంగీత విభావరి జరిగింది.

వేలిముద్రల స్థానంలో ఎఫ్ఆర్ఎస్

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు నిలయంగా ఉన్న ఫింగర్ ప్రింట్స్ స్థానంలో ఎఫ్ఆర్ఎస్ విధానం అమలులోకి వచ్చిందని అంబర్‌పేట సర్కిల్ - 16 డీఎంసీ మారుతిదివాకర్ తెలిపారు. బుధవారం కాచిగూడ డివిజన్‌లో ఫేస్ రికగ్నైజ్‌డ్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలతతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ.. అంబర్‌పేట సర్కిల్-16 పరిధిలో ఆరు మున్సిపల్ డివిజన్లలో 700 మంది స్వీపర్స్, ఎస్ఎఫ్ఏలు ఉన్నారని, వారందరికీ ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు.

బహుజన ముక్తి పార్టీ ఎంపీ అభ్యర్థుల ప్రకటన

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బహుజన ముక్తి పార్టీ(బీఎంపీ) ఎంపీ అభ్యర్థుల మొదటి జాబితాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ బుధవారం బాగ్‌లింగంపల్లిలో పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. నాగర్ కర్నూల్ - గడ్డం విజయ్, నిజామాబాద్ - దేవతి శ్రీనివాస్, మల్కాజ్‌గిరి - ఉప్పులేటి రాజేందర్, ఆదిలాబాద్ - భూక్యారాజు, పెద్దపల్లి నుంచి వేణుగోపాల్ పోటీ చేస్తారని ప్రకటించారు. సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ధర్మయ్య, కార్యదర్శి ఎండీ ఫయాముద్దీన్, డాక్టర్ నరేందర్ పవార్, మహమ్మద్ అన్సారీ పాల్గొన్నారు.

సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలి

● ప్రొఫెసర్ సుధారాణి

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వివక్ష, అణచివేత, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతూ సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇ.సుధారాణి పిలుపునిచ్చారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవంలో భాగంగా రాజ్యాంగం హక్కులు - చట్టాలు - సంక్షేమ పథకాలపై డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుధారాణి మాట్లాడుతూ.. దేశంలో 31 శాతం మంది మహిళలు రాజకీయాల్లో ఉన్నారన్నారు. మహిళలు హక్కులు, సాధికారత కోసం పోరాడాలన్నారు. జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, నాయకులు రజిత, వెంకటరెడ్డి, మంతెన రాయదాస్ దీప్తి, డాక్టర్ జిలకర శ్రీనివాస్, పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 50 మంది సామాజిక కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశావర్కర్లు మహిళా ఉపాధి హామీ కూలీలను సన్మానించారు.

టీఎస్ ఎప్‌సెట్‌కు ఏపీలో పరీక్షా కేంద్రాల పెంపు

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్‌కు ఆంధ్రప్రదేశ్‌లో పరీక్షా కేంద్రాలను పెంచినట్లు అధికారులు తెలిపారు. టీఎస్ ఎప్‌సెట్‌కు ఈ ఏడాది ఏపీలో పరీక్షా కేంద్రాలను భారీగా తగ్గించడంపై 'ఎప్‌సెట్‌కు ఏపీలో తగ్గిన పరీక్షాకేంద్రాలు' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి టీఎస్ ఎప్‌సెట్ ఉన్నతాధికారులు స్పందించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎప్‌సెట్‌కు ఏపీలో తగినన్ని పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయాలని, ఏపీ అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సెట్ నిర్వహణ బాధ్యత చేపట్టిన జేఎన్‌టీయూ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం జోన్ పరిధిలో విజయనగరం, విజయవాడ జోన్ పరిధిలో మచిలీపట్నం, గుడ్లవల్లేరు, గుంటూరు జోన్ పరిధిలో నర్సరావుపేట, తిరుపతి జోన్ పరిధిలో మదనపల్లి, కర్నూలు జోన్ పరిధిలో నంద్యాల, అనంతపురం పట్టణాల్లో అదనంగా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఏపీ అభ్యర్థుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు అవసరమైతే మరో 10 వేలమంది అభ్యర్థులకు సరిపడేలా పరీక్షాకేంద్రాలను ముందుగానే సిద్ధం చేసి ఉంచాలని టీసీఎస్ సిబ్బందికి జేఎన్‌టీయూ అధికారులు సూచించారు. కొత్త పరీక్షాకేంద్రాల ఏర్పాటుతో సుమారు 8,500 మంది అభ్యర్థులు వారి నివాస ప్రాంతాలకు సమీపంలో పరీక్షా కేంద్రాలను ఎంచుకునేందుకు వీలు ఏర్పడింది. పరీక్షా కేంద్రాలను పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల అక్కడి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైలుకింద పడి మహిళ ఆత్మహత్య

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ క్వార్టర్స్‌లో నివసిస్తున్న ఉమావతి(28) వివాహం అయిన తర్వాత విడాకులు తీసుకుంది. తల్లిదండ్రులు చనిపోవడంతో ఇద్దరు చెల్లెళ్లతో కలిసి నివసిస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం బుద్వేల్-ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



విరిగిపోయిన క్రీడా పరికరాలు

ఇందిరాపార్కులో..
క్రీడా పరికరాలకు తుప్పు

● విరిగిపోయిన వైనం ● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



విరిగిపోయిన ఓపెన్ జిమ్ సామగ్రి

కవాడిగూడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు ఆడుకునేందుకు ఇందిరా పార్కులో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు తుప్పు పట్టి విరిగిపోయాయి. క్రీడా సామగ్రితోపాటు క్యాంటిన్ సమీపంలో ఓపెన్ జిమ్ పరికరాలు కూడా విరిగిపోయాయని ప్రతిప్రతినిధులు, ఉద్యానవన శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో చిన్నారులు ఆడుకుంటూ తుప్పు పట్టిన పరికరాలతో గాయపడిన సంఘటనలు ఉన్నాయి. వేసవి సెలవుల్లో ఇందిరా పార్కుకు కుటుంబసమేతంగా వచ్చి సరదాగా గడుపుతామని అనుకునే వారికి తుప్పు పట్టిన, విరిగిపోయిన క్రీడా పరికరాలు దర్శనమిస్తున్నామని పలువురు వాపోయారు. పార్కుకు ప్రతిరోజూ 1500 నుంచి రెండు వేలమంది సందర్శకులు వస్తున్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పార్కులో మూడు నెలల క్రితం సుమారు రూ. 25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు విరిగిపోయాయని వాకర్స్ ఆరోపిస్తున్నారు.

పార్కును అభివృద్ధి చేస్తామంటున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు క్రీడా పరికరాల దుస్థితిపై సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు జిమ్, చిన్నారులు ఆడుకునే క్రీడా పరికరాలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

నాణ్యతలేని జిమ్ పరికరాలు



ఓపెన్ జిమ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలు నాణ్యత లేకపోవడంతో విరిగిపోతున్నాయి. ప్రభుత్వం పార్కు అభివృద్ధి కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా కాంట్రాక్టర్లు నాణ్యతలేని జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

\- డాక్టర్ ఎ. సుధాకర్ యాదవ్,
ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

పార్కులో సమస్యల పరిష్కారానికి కృషి



పార్కులో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటాం.

\- రచనశ్రీ, కార్పొరేటర్

విరిగిపోయిన ఆటవస్తువులకు మరమ్మతులు చేయిస్తాం



పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు నూతన పరికరాల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఓపెన్ జిమ్‌లో విరిగిపోయిన వస్తువులకు మరమ్మతులు చేయిస్తాం.

\- భాస్కర్, ఇందిరాపార్కు మేనేజర్

యూపీహెచ్‌సీలలో మరింత మెరుగైన వైద్య సేవలు

● డాక్టర్ వెంకటి



మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి

ముషీరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ), బస్తీ దవాఖానాల్లో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ వెంకటి తెలిపారు. బుధవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీ భవనంలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) కార్యక్రమంపై నాంపల్లి, బార్కస్ క్లస్టర్‌ల పరిధిలోగల యూపీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న డాక్టర్ వెంకటి మాట్లాడుతూ.. అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు ఇంటింటి సర్వేతోపాటు ఎన్‌సీడీ స్క్రీనింగ్‌ను ముమ్మరం చేశామన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా 12 రకాల ఆరోగ్య సేవలను అన్ని యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ఈ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో తెలుగులో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశ్రితరెడ్డి, ఎస్పీహెచ్‌వోలు డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ జయ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే సామాజిక శక్తుల కర్తవ్యం



మాట్లాడుతున్న జేబీ రాజు

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించడమే సామాజిక శక్తుల కర్తవ్యమని అంబేడ్కర్ వాది జేబీ రాజు పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికలు - సామాజిక శక్తుల కర్తవ్యం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికలలో మనుస్మృతి, రాజ్యాంగ శక్తులకు మధ్య ప్రధాన పోటీ నెలకొందని, మనుస్మృతి వారసురాలుగా ఉన్న బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులు, మహిళలకు రక్షణ లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం ద్వారా రిజర్వేషన్లు లేకుండా చేయాలని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆలోచిస్తుందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడల్లా రాజ్యాంగానికి ప్రమాదఘంటికలు మోగుతాయన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం పనికిరాదని ఆర్ఎస్ఎస్, బీజేపీ పలుమార్లు ప్రకటించాయని ధ్వజమెత్తారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి.రాములు, నగర అధ్యక్షుడు ఎం. దశరథ్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్, బంధు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లెల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్థిరమైన అభివృద్ధికి డిజిటల్ ఫైనాన్స్ దోహదం

● ప్రొఫెసర్ చెన్నప్ప

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థిరమైన అభివృద్ధికి డిజిటల్ ఫైనాన్స్ దోహదపడుతుందని ఓయూ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ చెన్నప్ప అన్నారు. డిజిటల్ ఫైనాన్స్ అనేది డిజిటల్ ప్లాట్‌ఫాంల ద్వారా లావాదేవీలు పెట్టుబడులు ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌ను సులభతరం చేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కాచిగూడలోని బద్రుకా వాణిజ్య కళాశాల ఆధ్వర్యంలో బుధవారం డిజిటల్ ఫైనాన్స్ - స్థిరమైన అభివృద్ధి కోసం ఒక వ్యూహం అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వాణిజ్యరంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భారతీయ రిజర్వ్ బ్యాంకు మాజీ మేనేజింగ్ డైరెక్టర్ ఆజా సుధాకర్, బద్రుకా కళాశాల పూర్వవిద్యార్థి సీఎస్ పాల్వాయి విక్రమ్‌రెడ్డి, ఓయూ మాజీ డీన్ ప్రొఫెసర్ కేవీ చలపతి, నాబార్డ్ మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు కస్తూరి, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజని తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో బద్రుకా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సోమేశ్వర్‌రావు, కళాశాల కార్యదర్శి కిషన్ బద్రుక, డైరెక్టర్ జనరల్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. మోహన్‌కుమార్, సదస్సు కన్వీనర్లు ఎం. జానకిరామ్, డాక్టర్ పి. వెంకటయ్య పాల్గొన్నారు. పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు పరిశోధన పత్రాలు సమర్పించారు.

జంతువులతో ప్రేమగా మెలగాలి



సదస్సును ప్రారంభించిన అతిథులు

కవాడిగూడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జంతువుల పట్ల ప్రేమతో మెలగాలని, సమాజాభివృద్ధి కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని వరల్డ్ ఉమెన్ ఫెడరేషన్ డైరెక్టర్ ఫరిదా తాంపల్ అన్నారు. దోమలగూడ ఏవీ కళాశాలలో 'మానవ జీవన విధానంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు' అనే అంశంపై అంతర్జాతీయ వర్క్‌షాపు బుధవారం నిర్వహించారు. వర్క్‌షాపును ఫరిదా తాంపల్, ఏవీ కళాశాల కార్యదర్శి అచ్యుతప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ రాజలింగం, వైస్ ప్రిన్సిపాల్ పి. పద్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా తాంపల్ మాట్లాడుతూ.. కొత్త ఆవిష్కరణలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా చేపట్టిన పర్యావరణ పరిరక్షణను ప్రపంచం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఏవీ కళాశాల కార్యదర్శి అచ్యుత ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతిని పరిరక్షిస్తూ.. జీవజాతుల సమ్మేళనంలో సాంకేతిక విధానాన్ని జోడించి ముందుకు సాగాలన్నారు. జీవజాతుల ద్వారా ఆర్థిక పురోగమనం, మానవాభివృద్ధి సమతుల్యపు ఆహారపు అలవాట్లు తదితర అంశాలను ప్రిన్సిపాల్ సీహెచ్ రాజలింగం విద్యార్థులకు వివరించారు.

వైస్ ప్రిన్సిపాల్ పి. పద్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకోసం బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. కార్యక్రమంలో వీవీ సుబ్బారెడ్డి, ఆర్. మంతన, కళాశాల కరస్పాండెంట్ గౌతమిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ విజయాన్ని ఏ శక్తులూ అడ్డుకోలేవు'

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఏ శక్తులు అడ్డుకోలేవని కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. సికింద్రాబాద్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బుధవారం అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు దానం నాగేందర్‌ను కలిసి సత్కరించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు కిరణ్, సోను, సందీప్, మహేష్, జశ్వంత్ పాల్గొన్నారు.

దానం గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం అంబర్‌పేట నియోజకవర్గం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు.

వేతన సవరణ బకాయిలు చెల్లించాలి

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణ బకాయి 50 శాతం బాండు డబ్బులను వెంటనే చెల్లించాలని ఎస్‌డబ్ల్యూయూ, ఐఎన్‌టీయూసీ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆర్టీసీ బస్ భవన్‌లో ఎండీ సజ్జనార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ కె. హనుమంతు ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్, రాష్ట్ర వర్కింగ్ వైస్ చైర్మన్ మల్లేశం, నాయకులు బెన్ సుశీల్, అబ్రహం, గోలి రవీందర్, స్వాములయ్య, పి.సుభాష్, ఎండీ హఫీజ్‌ఖాన్ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

● సెంట్రల్ జోన్ డీసీపీ అక్షన్ష్‌యాదవ్



ఫ్లాగ్ మార్చ్‌లో డీసీపీ అక్షన్ష్‌యాదవ్, ఏసీపీ రమేష్‌కుమార్ తదితరులు

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షన్ష్ యాదవ్ కోరారు. బుధవారం ముషీరాబాద్ పీఎస్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలైన భోలక్‌పూర్, ఇందిరానగర్, బొంతలబస్తీ, గుల్షన్‌నగర్, పద్మశాలికాలనీ, సుప్రీంహోటల్ తదితర ప్రాంతాలలో సీఐఎస్ఎఫ్, ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్‌తో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, మత ఘర్షణలకు పాల్పడే వారిని బైండోవర్ చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఆనంద్, చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ముషీరాబాదా ఎస్‌హెచ్‌వో నిరంజన్, చిక్కడపల్లి ఎస్‌హెచ్‌వో సీతయ్య, ఎస్ఐలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యూ డెమోక్రసీ నేతలు

ప్రజావ్యతిరేకపాలన సాగిస్తున్న బీజేపీని ఓడించాలి

● సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు పిలుపునిచ్చారు. బుధవారం విద్యానగర్‌లో మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో పార్టీ నేతలు సాధినేని వెంకటేశ్వరరావు, కె.గోవర్ధన్, సంధ్య, ఝాన్సీ తదితరులు మాట్లాడారు. మోదీ ఆదివాసీ, గిరిజనుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు ఎం.శ్రీనివాస్, పి.అనురాధ, కె.మధు, టి.శ్రీనివాస్, పి.ఐలయ్య, సీతారామయ్య, అరుణ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ అభ్యర్థిగా మురళీకృష్ణ

మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థిగా మోకాళ్ల మురళీకృష్ణను బరిలోకి దింపుతున్నామని పార్టీ ప్రకటించింది. ఆయనను ప్రజలు గెలిపించాలని వారు కోరారు.

హిందువులపై దాడులను సహించబోం : బజరంగ్‌దళ్

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత హిందువులపై దాడులు పెరిగిపోతున్నాయని, దాడులు, దౌర్జన్యాలను సహించబోమని బజరంగ్‌దళ్ హెచ్చరించింది. మతమార్పిడి, లవ్ జిహాద్, దేవాలయ భూముల కబ్జా, గో హత్య వంటి హిందూ వ్యతిరేక కార్యక్రమాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరీ నాథ్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు మాట్లాడారు. చెంగిచెర్ల పిట్టల బస్తీలో గిరిజనులపై ఓ వర్గం దాడిచేసినా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళితే బాధితులపైనే పోలీసులు దాడి చేసి రిమాండ్‌కు తరలించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో చీకటి రోజని అన్నారు.

23న వీర హనుమాన్ విజయ్‌యాత్ర

ఏప్రిల్ 23న మూడు లక్షల మందితో వీర హనుమాన్ విజయ్‌యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి హిందువు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విజయ్‌యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి వీరేశలింగం పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఫొటో జర్నలిస్టులు

ఫొటో జర్నలిస్టులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ఫొటో జర్నలిస్టులపై దాడులు పత్రికా స్వేచ్ఛపై దాడేనని రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్, ప్రధానకార్యదర్శి కేఎన్ హరి ఆరోపించారు. ఢిల్లీలో ఫొటో జర్నలిస్టులపై దాడిచేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్ట్‌కు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు చేస్తున్న నిరసనలను ఫొటో జర్నలిస్టులు కవర్ చేస్తుండగా ఢిల్లీ పోలీసులు అకారణంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ వద్ద ఫొటో జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గాయపడిన ఫొటో జర్నలిస్టులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘం కోశాధికారి కె. అనిల్‌కుమార్, కార్యవర్గసభ్యులు ఎన్. శ్రీనివాస్, ఎండీ అలీముద్దీన్, నాయకులు జి.బాలస్వామి, సయ్యద్ మజార్ తదితరులు పాల్గొన్నారు.

31న పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ప్రారంభం

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31న పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు బీఆర్‌పి సుశీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వింజమూరి సుధాకర్ తెలిపారు. వివరాలకు 9440874432 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

జాబ్ మేళాలో 70 మందికి ఉద్యోగ అవకాశాలు

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. సుమారు పదికిపైగా కంపెనీలు పాల్గొన్నాయి. 70మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ రిషికాంత్ మాట్లాడుతూ.. మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించిన కంపెనీల మేనేజ్‌మెంట్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ పతాక ఆవిర్భావోత్సవాలు

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక 103వ ఆవిర్భావోత్సవాలు బుధవారం రాంనగర్‌గుండులోగల పింగళి వెంకయ్య చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి జీఎన్ కేశవ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు రాజుగౌడ్‌ను సంస్థ చైర్‌పర్సన్ కె.హెచ్.ఎస్. జగదాంబ సన్మానించి జాతీయ పతాక జ్ఞాపికను అందజేశారు. సంస్థ సభ్యులు శ్యామలరావు, అనుదీప్, శ్రీకాంత్, రాజేష్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీలు బీజేపీకి అండగా ఉండాలి'

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఎస్సీలు బీజేపీకి అండగా ఉండాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ. అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం బర్కత్‌పుర నగర కార్యాలయంలో బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం ఎస్సీ మోర్చా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని కోరారు.